గెలిచి.. చంద్రబాబుకు కానుకగా ఇస్తాను



నా పుట్టినరోజున టిక్కెట్ ప్రకటించి చంద్రబాబు నాకు గిఫ్ట్ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పని చేస్తా. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ఘన విజయం సాధిస్తా. అమలాపురం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తాను.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా...



గత ఐదేళ్లలో అంకితభావంతో చేసిన సేవలను టీడీపీ అధిష్ఠానం గుర్తించి మరోసారి అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను ప్రకటించింది. దుర్మార్గ పాలన అందిస్తున్న జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు ఓటర్ల ముందుకు వెళ్లి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తాను. నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి

కాకినాడ సిటీలో గెలిచి చూపిస్తా...



చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో ఈ సీటు కేటాయించారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కాకినాడ సిటీలో గెలిచి చూపిస్తా. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఎన్నికల బరిలో దిగుతాను. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే ఉమ్మడి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయి.

- వనమాడి కొండబాబు, కాకినాడ సిటీ టీడీపీ అభ్యర్థి



- » టీడీపీ మూడో జాబితా విడుదల
- » రెండు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన
- » కాకినాడ సిటీకి కొండబాబు
- » అమలాపురానికి ఆనందరావు
- » అమలాపురం లోక్‌సభకు హరీష్‌మాధుర్
- » మిగిలింది రాజమండ్రి లోక్‌సభ
- » ఉమ్మడి జిల్లాలో 21 స్థానాలకు ఎంపిక
- » నేడు పి.గన్నవరం అభ్యర్థి ప్రకటన
- » అభ్యర్థులు మంగళగిరి పయనం

టీడీపీ టిక్కెట్లపై ఉత్కంఠ వీడింది.. నిన్నటి వరకు కాకినాడ సిటీ, అమలాపురం టిక్కెట్లపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఎవరు బరిలో ఉంటారు.. ఎవరు ఉండరనే దానిపై.. ఏ పార్టీ నుంచి పోటీ ఉంటుందనే దానిపై రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తూ వచ్చారు. ఎట్టకేలకు టీడీపీ మూడో జాబితా విడుదల చేసి సస్పెన్స్‌కు తెరదించింది. ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం లోక్‌సభ, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి తేలవలసి ఉంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠకు తెరపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన దాదాపు పూర్తయింది. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడో జాబితాలో కాకినాడ సిటీ అసెంబ్లీ, అమలాపురం అసెంబ్లీ, అమలాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఉత్కంఠకు తెరదించింది. కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని బలంగా ఢీకొట్టగలిగే నేతను ఎంపిక చేయడంపై పార్టీ హైకమాండ్ దృష్టి సారించింది. సామాజికవర్గ సమతూకంపైనా కసరత్తు చేసింది. చివరకు మత్స్యకార సామాజికవర్గానికే సీటు కేటాయించింది. దీనిలో భాగంగా ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబువైపే మొగ్గు చూపింది. ఆయన్నే అభ్యర్థిగా ఖాయం చేసింది. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లాలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ప్రకటించారు. అడుగడుగునా ఆటంకాలను ఎదుర్కొని అమలాపురం అసెంబ్లీ సీటు దక్కించుకున్నారు. ఇందుకు మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణ తనయుడు రమణబాబుతో పాటు ఆయన వర్గం నేతలు చేసిన కృషి ఫలించింది. పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించే అయితాబత్తుల ఆనందరావును అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కార్యకర్తల్లో జోష్ పెరిగింది. మిగిలిన పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానానికి జనసేన అభ్యర్థిని శనివారం అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది. అమలాపురం లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్‌ను ఎంపిక చేసింది. టీడీపీ అధిష్ఠానానికి అత్యంత విధేయుడిగా ఉన్న హరీష్‌మాధుర్‌కే అమలాపురం లోక్‌సభ అభ్యర్థిత్వం కట్టబెట్టింది. అమలాపురం లోక్‌సభ సీటు కోసం హరీష్‌తో పాటు ఐఏఎస్ అధికారి సతీమణి డాక్టర్ సత్యశ్రీ, పారిశ్రామికవేత్త యాతాటి రమేష్‌బాబు ప్రయత్నించారు. సత్యశ్రీ పట్ల అధిష్ఠానం చివరి క్షణం వరకు ఒకింత సానుకూలతతో ఉన్నప్పటికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక భూమిక వహించడంతో టిక్కెట్ హరీష్‌నే వరించింది. అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలో పూజలు చేసే సమయంలో హరీష్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనకు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చారంటూ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

21 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 22 అసెంబ్లీ స్థానాలు ఉండగా 21 స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపిక మొత్తం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థుల ఎంపికపై టీడీపీ, జనసేన పార్టీలు ఎట్టకేలకు స్పష్టత నిచ్చేశాయి. ఇన్నాళ్లు కొన్ని సీట్లపై పీటముడి కొనసాగింది. శుక్రవారం మిగిలిన రెండు సీట్లు ప్రకటించడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క స్థానం మినహా అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. కాకినాడ లోక్‌సభ పరిధిలోని ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తేలిపోయింది. మొత్తం ఏడు సీట్లలో టీడీపీ ఐదుచోట్ల, జనసేన రెండుచోట్ల పోటీ చేయడం ఖాయమైంది. ఇటీవల పవన్ పిఠాపురం సీటు నుంచి తానే పోటీ చేస్తున్నట్టు స్వయంగా వెల్లడించడంతో సస్పెన్స్ వీడింది. కాకినాడ సిటీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం జరిగింది. టీడీపీ మాత్రం ఈ స్థానంపై ఎడతెగని కసరత్తు చేసింది. ప్రత్యర్థి వైసీపీ తరఫున ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థికంగా బలంగా ఉండడంతో అదే స్థాయిలో బలమైన అభ్యర్థిని నిలబెట్టే ఉద్దేశంతో టీడీపీ అధిష్ఠానం ఈ సీటుపై వ్యూహాత్మకంగా కదిలింది. ఇతర సామాజికవర్గాల నుంచి బలమైన అభ్యర్థులను సీటు కోసం పరిశీలించింది. కాకినాడ సిటీలో అత్యధికంగా మత్స్యకార సామాజికవర్గం ఉండడంతో వారికి తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ఆ సామాజికవర్గం వైపే మొగ్గుచూపింది. జిల్లాలో ఒక సీటు మత్స్యకారులకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుండడంతో దాన్ని కాదనలేకపోయింది. అనేక తర్జనభర్జనల తర్వాత చివరకు మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండబాబు పేరునే ఖాయం చేసింది. దీంతో కాకినాడ జిల్లాలో ఏడు స్థానాల్లో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. మొత్తం ఏడు స్థానాల్లో రెండు సీట్లను బీసీలకు కేటాయించి వెనుకబడిన వర్గాలకు టీడీపీ పెద్దపీట వేసింది. వైసీపీ కూడా ఇప్పటికే ఏడు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఒక్కటంటే ఒక్క సీటు కూడా జిల్లాలో బీసీలకు ఇవ్వకుండా వారిని అవమానించింది. మొత్తం అన్ని సీట్లు ఓసీలకు కట్టబెట్టడంతో వైసీపీ తీరుపై బీసీ వర్గాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. బీసీ వ్యతిరేక పార్టీగా వైసీపీపై కారాలు మిరియాలు నూరుతున్నారు. అటు వైసీపీలో కొన్ని సీట్లకు బీసీ అభ్యర్థులు పోటీకి సిద్ధమైనా కనీసం వారెవరినీ పరిగణలోకి తీసుకోకపోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో టీడీపీ 5 జనసేన 2 స్థానాల్లో బరిలో ఉన్నాయి. ఏడు అసెంబ్లీ స్థానాల్లో రెండు ఎస్సీ, ఒకటి బీసీ, నాలుగు ఓసీలకు కేటాయించారు. ఎంపీ అభ్యర్థి తేలవలసి ఉంది. రాజమహేంద్రవరం లోక్‌సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తారని సమాచారం. కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఆరుచోట్ల అభ్యర్థులను ప్రకటించారు. మూడు ఎస్సీ, ఒక బీసీ, రెండు స్థానాలు ఓసీలకు కేటాయించారు. పి.గన్నవరం అసెంబ్లీ స్థానం విషయానికొస్తే తొలి జాబితాలో టీడీపీ తరఫున సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. తదనంతర పరిణామాల్లో ఆయన వైదొలగడంతో సీటును జనసేన, బీజేపీల్లో ఎవరికి కేటాయిస్తారో అన్న సందిగ్ధత నెలకొంది. జనసేనకే కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు సానుకూలంగా సంకేతాలు పంపాయి. విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును అధిష్ఠానం దాదాపు ఖరారు చేసిందని, శనివారం లాంఛనంగా ప్రకటించనున్నట్టు సమాచారం అందింది. శనివారం మంగళగిరిలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు హరీష్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు పయనమయ్యారు.



పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులతో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారానికి..

పవన్ శ్రీకారం


- » రాష్ట్రవ్యాప్త పర్యటనలు ఇక్కడినుంచే ప్రారంభం
- » పార్టీ ముఖ్యులతో జనసేన అధినేత సమావేశం

- 7లో

జగన్ బొమ్మ..

తెచ్చిన తంటా

- » విద్యార్థుల సర్టిఫికెట్ల జారీకి సంకటం
- » కోడ్ అమలు నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌తో ఇబ్బంది
- » ఇవ్వకపోతే దరఖాస్తుదారులతో సమస్య



సర్టిఫికెట్‌పై ఉన్న సీఎం బొమ్మ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 22: సీఎం జగన్ ప్రచార పిచ్చి విద్యార్థుల పాలిట సంకటంగా మారింది. ప్రతి పథకం మీద, ప్రతి సర్టిఫికెట్ మీద ఆయన బొమ్మ ఉండేలా చేయడం ఎన్నికల కోడ్ అమలు కావడంతో తలనొప్పిగా మారింది. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించిన కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయడం నిలిపివేశారు. సీఎం జగన్ బొమ్మ ఉండడంతో అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయడంలేదు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ ప్రదర్శన చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. సర్టిఫికెట్ జారీ చేస్తే ఎన్నికల కమిషన్‌తో ఒక తంటా.. జారీ చేయకపోతే దరఖాస్తుదారులతో మరో తంటా అన్నట్లు అధికారుల పరిస్థితి తయారైంది.

విద్యార్థులకు ఇక్కట్లు

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎక్కడా కూడా నాయకుల ఫొటోలు ఉండకూడదని ఎలక్షన్ కమిషన్ స్పష్టం చేసింది. సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల ద్వారా ఇచ్చే ధృవపత్రాలు, పాస్‌బుక్‌లపై కూడా ఫొటోలు ఉంటే వాటి జారీని నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో విద్యార్థులకు ఇక్కట్లు మొదలయ్యాయి. పాఠశాల చేరికలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, కులధృవీకరణ పత్రాలు, ఆదాయం సర్టిఫికెట్లు, ఆర్థికంగా వెనుకబడిన వారనే ధృవీకరణ పత్రాలు తీసుకోవాల్సి ఉంటుంది. వీటి కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు పంపించి పరిశీలించాక జారీచేస్తారు. వాటిని దరఖాస్తుతోపాటు జతచేస్తే ఆయా విభాగాల కింద విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించి సీట్లు కేటాయిస్తారు. ఈ వ్యవహారమంతా పూర్తి కావడానికి వారంనుంచి పది రోజులు పడుతుంది. సచివాలయంలో ముందు దరఖాస్తు చేయాలి. ఎప్పటిలాగే అంతా సచివాలయాలకు వెళ్తుంటే అక్కడి సిబ్బంది వాటిని తీసుకోవడంలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని సర్టిఫికెట్లు జారీ కావని చెప్పి తిరస్కరిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిశాకే జూన్ రెండోవారంలో రావాలని చెపుతున్నారు. దీంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. జూన్‌లో ఏకంగా విద్యాలయాల్లో తరగతులు మొదలవుతాయని అప్పుడు ఇస్తామంటే ఎలాగని వాపోతున్నారు. ఎన్నికలకు సర్టిఫికెట్లకు సంబంధం ఏంటని తెలియనివారు ప్రశ్నిస్తే వాటిపై సీఎం బొమ్మ ఉంటుందని అందుకే ఎన్నికల సంఘం వద్దని చెప్పిందని సమాధానమిస్తుండడంతో ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు ఇచ్చే సర్టిఫికెట్లు పదికాలాలు భద్రపరుచుకునే పత్రాలపై నాయకుల బొమ్మలు ఎలా వేస్తారని దానికి ఎవరు అనుమతిచ్చారని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదని, ఈ ప్రభుత్వం వచ్చాకే ఇలాంటి పనులు చేస్తున్నారని, ఇప్పుడు తమకు నెలాఖరులోగా సర్టిఫికెట్లు కావాలని ఇవ్వకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించి వెళ్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలిగా..

ప్రభుత్వ నిర్ణయాలవల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు నష్టపోకుండా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సీఎం, ఇతర నాయకుల బొమ్మలు ఏమీ లేకుండా ధృవపత్రాలు జారీచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్నికల సంఘానికి నివేదించి తగిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ఈవీఎంల భద్రతకు

కట్టుదిట్టమైన చర్యలు: కలెక్టర్



ఈవీఎం, వీవీ ప్యాట్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి22: జిల్లాలో అధికారులు సమన్వయంగా వ్యవహరించి ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్స్ గోదాములకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎంల గోదామును రెవెన్యూ, ఎన్నికల అధికారులు, అగ్నిమాపక, గుర్తింపు పొందిన రాజకీయ నాయకుల ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతినెలా ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాములను తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపిస్తున్నామన్నారు. ప్రతి మూడునెలలకు ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధుల సమక్షంలో వీటిని పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో తిప్పేనాయక్, కాకినాడ ఆర్డీవో కిషోర్, అగ్నిమాపక అధికారి ఏసుబాబు, కాకినాడ తహసీల్దార్ చెల్లన్న దొర, కలెక్టరేట్ డీటీ జగన్నాథం, టీడీపీ, వైసీపీ, బీజేపీ, బీఎస్పీ, సీపీఎం నాయకులు సాయిబాబా, వెంకటేశ్వరరావు, విజయరామయ్య, అప్పారావు, చంద్రరావు పాల్గొన్నారు.

గడువు లోపు ఓటు దరఖాస్తుల పరిష్కారం

» కమిషనర్‌కు వివరించిన జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22: ఎన్నికల సంఘం సూచనల ప్రకారం జిల్లాలో ఓటు నమోదుకోసం చేసిన దరఖాస్తులను గడువు లోపు పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా అన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముకేష్‌కుమార్ మీనా శుక్రవారం అమరావతినుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ కలెక్టరేట్‌నుంచి హాజరైన కలెక్టర్ గడువులోపే దరఖాస్తులను పరిష్కరిస్తున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఈవీఎంల రిపోర్ట్, సీవిజిల్, పోస్టల్ బ్యాలెట్ వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. నియమావళి అమలులోకి వచ్చాక తీసుకున్న చర్యలను కలెక్టర్ తెలిపారు. రాజకీయపార్టీ నాయకుల బ్యానర్లు, జెండాలు తొలగింపు వంటి అంశాలను వివరించారు. ఎన్నికలుప్రశాంతంగా జరగడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

జనన, మరణ పత్రాల జారీపై త్వరలో కొత్త మార్గదర్శకాలు


కార్పొరేషన్(కాకినాడ), మార్చి 22: జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని కేంద్రానికి చెందిన డీసీవో అధికారుల బృందం వెల్లడించింది. హైదరాబాద్‌లో డైరెక్టర్ సెన్సెస్ ఆపరేషన్(డీసీవో) డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ పీఎల్ఎన్‌సీ శిశుకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రజ శుక్రవారం కాకినాడ నగరపాలకసంస్థలోని జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించిన విభాగాన్ని సందర్శించారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖకు చెందిన అధికారులు వీరితో సమావేశమయ్యారు. జనన, మరణాల సమాచారాన్ని అందించే సంబంధిత ఆస్పత్రి వర్గాలు, ఉద్యోగులకు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరలోనే మరిన్ని కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని, వీటన్నింటినీ అధ్యయనం చేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు.

'ద్వితీయ శ్రేణి'పై దృష్టి

- » ఓటు బ్యాంకులను ఆకట్టుకునే ప్రయత్నాల్లో పార్టీలు
- » సామాజిక వర్గాల వారీ వ్యక్తులతో చర్చలు
- » ఇప్పటికే పలువురితో ఒప్పందాలు

సామర్లకోట, మార్చి 22: ఎన్నికల వేడి రాజుకుంది. ప్రధాన పార్టీల నేతలు వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా గ్రామస్థాయిలోని ఓటు బ్యాంకులపై దృష్టిసారించారు. ద్వితీయ శ్రేణి నేతలు సామాజికవర్గాల వారీ కాస్త పలుకుబడి ఉన్న వ్యక్తులను తమవైపు రాబట్టుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే అధికార వైసీపీలోని సీనియర్ నేతలు టీడీపీ వైపు మొగ్గు చూపుతూ పార్టీలోకి చేరే కదలికలు ముమ్మరం చేశారు. మరోపక్క సీనియర్ పార్టీ నాయకులను, కార్యకర్తలను పార్టీని వీడకుండా బుజ్జగింపుల పర్వంపై అధికారపక్షం దృష్టిసారించింది. ఇప్పటికే బీజేపీ, టీడీపీ, జనసేనల పొత్తుతో మూడు పార్టీల నాయకులు ఒకే వేదికపైకి రావడంతో అధికార వైసీపీ అన్నీ తానై బుజ్జగింపుల పర్వంపై దృష్టిసారించింది. ఈ విషయంలో ఇప్పటికే కొందరు ముందున్నారు. పలువురితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. గ్రామస్థాయిలో ఓటర్లను సమీకరించడంలో వారి నేత తమకు అనుకూలమైన పార్టీ అభ్యర్థికి ఓటు వేయించడంలో ద్వితీయ శ్రేణి నాయకులు కీలకపాత్ర పోషిస్తుంటారన్నది తెలిసిందే. అలాంటి ఓటు బ్యాంకులను రాబట్టుకునే పనిలో ప్రధాన పార్టీల తరఫున పోటీకి సిద్ధమైన నేతలు నిమగ్నమయ్యారు. అలాంటి వారిని గుర్తించి సామ, దాన, బేధ దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. ఇటీవల ఇదే రీతిలో ఒక సీనియర్ కార్యకర్త అధికారపార్టీపై కినుక వహించి టీడీపీలోకి చేరే ప్రయత్నాలను అధికార పార్టీ నాయకులు తాత్కాలికంగా బుజ్జగించారు. ప్రతిపక్ష నాయకులతోను మరోవైపు మంతనాలు సాగిస్తుండడం గమనార్హం. దీంతో వివిధ పార్టీల తరఫున గతంలో పనిచేసి తెరమరుగైన వారు సైతం తాజా పరిస్థితులతో మేమూ నాయకులమేనంటూ వెలుగులోకి వస్తున్నారు. తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. పట్టణ, గ్రామాల్లో ఉన్న ద్వితీయశ్రేణి నాయకులు ఇప్పటికే తమ అనుయాయులతో అభ్యర్థుల దృష్టిలో పడేందుకు కసరత్తు చేస్తున్నారు. వారు ఏ స్థాయి నాయకులు అనే విషయాన్ని పక్కనబెట్టి ప్రతిఒక్కరినీ అక్కున చేర్చుకుంటేనే మంచిదన్న అభిప్రాయం ప్రధాన పార్టీల్లో కనిపిస్తోంది. ఇందులో భాగంగా ఓటు బ్యాంకులుగా ఉన్న వారి డిమాండ్లను పరిష్కరించేందుకు ముందుకు వస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా లబ్ధిపొందేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా, మరికొందరు సామాజిక అవసరాలను తీర్చాలని కోరుతున్నారు. అందుకు అవసరమైన హామీలు ఇచ్చే వారికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

కోడ్ ఉల్లంఘనలు పట్టవా?



తుని పట్టణంలోని పలు గృహాల్లో టీవీల్లో కనిపిస్తున్న జగన్ చిత్రాలు

తుని రూరల్, మార్చి 22: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పలుచోట్ల సీఎం జగన్ చిత్రాలు, పేర్లు తొలగించడం లేదు. వైసీపీ జెండాలు, ఫ్లెక్సీలు కూడా చాలాచోట్ల దర్శనమిస్తున్నాయి. ఎన్నికలు కోడ్ వచ్చి వారం గడుస్తున్నా పార్టీ పరమైన చిత్రాలు, పేర్లు కనిపిస్తున్నాయి. తునిలో టీవీల్లో జగన్ చిత్రాలు కనిపిస్తుండడం విమర్శలకు తావిస్తుంది.

కిర్లంపూడిలో ఒక ఫీల్డ్ అసిస్టెంట్, ఇద్దరి వలంటీర్లు సస్పెండ్

కిర్లంపూడి, మార్చి 22: ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ ఒకరు, ఇద్దరు వలంటీర్లు సస్పెండ్ అయ్యారు. జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కృష్ణవరంలో వైసీపీ ప్రచారంలో పాల్గొని ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందున స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ కోలా వీరబాబును, మరో ఇద్దరు వలంటీర్లను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు. రెవెన్యూ పరిధిలోని సివిల్ సప్లయికి చెందిన బొదిరెడ్ల రాజేష్ కన్నబాబు ప్రచారంలో పాల్గొన్నందున షోకాజ్ నోటీసులు ఇచ్చారు.



- పెద్దాపురం

అరచేతిలో.. అనుమతులు!

- 'సువిధ' యాప్ ద్వారా 48 గంటల్లో ప్రచార అనుమతులు
- దరఖాస్తుల పరిశీలన అనంతరం జారీ
- ఎన్నికల ప్రక్రియ సులభతరం

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశం నిర్వహించాలంటే ఇదివరకూ తెల్ల కాగితంపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులు ఇచ్చేవారు. ఇది నాయకులకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఎన్నికల సంఘం 'సువిధ' యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రచార అనుమతులు జారీకి అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అనుమతుల జారీచేస్తారు. ఇప్పటికే ఎన్నికల ప్రచార జోరు సాగుతోంది. నామినేషన్ వేయగానే అభ్యర్థులు సభలు, సమావేశాలపై దృష్టిసారిస్తారు. ర్యాలీలతో హోరెత్తిస్తారు. ఎన్నికల ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల సంఘం ప్రచార పర్వంలో నిబంధనలు విధించింది. అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా, ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. దీనికి సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఇలా చేయాలి..

- అభ్యర్థి తమ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి సువిధ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతోపాటు తమకు ఏవిధమైన అనుమతులు కావాలో వాటిని యాప్‌లో నమోదుచేయాలి.
- అనుమతులకు సంబంధించి మీ సేవ చలానా చెల్లించాలి.
- చెల్లించిన చలానా రసీదు, సువిధలో నమోదుచేసి వివరాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలి.
- దరఖాస్తు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే ఎటువంటి జాప్యం చేయకుండా అనుమతులు జారీచేస్తారు.
- ఏదైనా పరిస్థితిలో జాప్యం జరిగితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వీటన్నింటికీ అవసరమే..

ప్రచారంలో వినియోగించే కార్లు, ద్విచక్ర వాహనాలు ఇంటింటి ప్రచారానికి, ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించేందుకు, సభా నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లౌడ్ స్పీకర్లు, జెండాలు, పోస్టర్ల వినియోగం తదితర ప్రచార అవసరాల కోసం తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇవి పరిశీలన అనంతరం అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు.



సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సమయం వృథా కాకుండా ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను తీసుకొచ్చింది. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతుల జారీ చేయడం జరుగుతుంది. అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా ముందుగా అనుమతులు తప్పనిసరి.

- జే.సీతారామారావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం

పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారానికి పవన్ శ్రీకారం

పుర్హూతికా అమ్మవారికి పూజల అనంతరం వారాహి ముందుకు.. విజయ నినాదం రాష్ట్రం నలువైపులా నినదించాలి

వైసీపీ కుయుక్తులు, కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి.. పార్టీ ముఖ్యులతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశం



పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

పిఠాపురం, మార్చి22: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని పిఠాపురం నుంచే శ్రీకారం చుట్టనున్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్ఠాన దేవత పుర్హూతికా అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పవన్ ప్రకటించిన నేపథ్యంలో పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్త పర్యటనలు జరగనున్నాయి. దత్తాత్రేయ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడి జన్మస్థలమైన పిఠాపురం నుంచి ప్రచారం ప్రారంభంతో మంచి జరుగుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచారం తదితర అంశాలపై మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ ముఖ్యనేతలతో శుక్రవారం ఉదయం నుంచి వరుస సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పార్టీ అధ్యక్షులు, టూర్ మేనేజ్‌మెంట్ టీమ్ కన్వీనర్లు, కోకన్వీనర్లతో సమావేశమయ్యారు. తాను పోటీచేసే పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని పవన్ నిర్ణయించారు. ఈ మేరకు పుర్హూతికా అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వారాహి వాహనం నుంచి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోనే మూడు రోజులపాటు ఉండి నియోజకవర్గ ముఖ్య నేతలు, మండల నాయకులతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రచారానికి రాకపోకలు సాగించనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర పార్టీ కార్యాలయ వర్గాలను పవన్ ఆదేశించారు. పిఠాపురం నుంచి తాను పోటీ చేస్తున్న నేపథ్యంలో వైసీపీ ఎన్నో పన్నాగాలు, కుయుక్తులు, కుట్రలు పన్నుతోందని, దీంతో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా నాయకులకు సూచించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయని, సమరంలో విజయం ఖచ్చితంగా మనదేనని తెలిపారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు గంగిరెడ్డి

కోర్టు అనుమతి ఇచ్చిన వెంటనే బాధితులకు న్యాయం

జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి

సర్పవరం జంక్షన్, మార్చి 22 : జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు అవసరమైన చట్టబద్ధ, న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఆ సంస్థ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. శుక్రవారం సర్పవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితులకు శఠగోపం పెట్టిన నిందితులైన పాత చైర్మన్, వైస్ చైర్మన్‌లతోపాటు డైరెక్టర్లు, రుణగ్రస్తులకు చెందిన సుమారు రూ.500కోట్ల పైబడి స్థిరాస్తులను ప్రభుత్వ సహకారంతో సీఐడీ సహకారంతో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఇందులో 39 జీవోల ద్వారా సుమారు రూ.300 కోట్ల మేర సీజ్ చేసిన స్థిరాస్తుల అమ్మకానికి కోర్టులో వేసి సేల్ ఆర్డర్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందన్నారు. ఈ ఆస్తులను విక్రయించుకునేందుకు కోర్టు ఉత్తర్వు ఇచ్చిన వెంటనే బాధితులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీజ్ చేసిన ఆస్తులు, సేల్ ఆర్డర్ కోసం వేచిచూస్తున్న ఆస్తులపై బాధితులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అడ్వాన్సుగా రూ.300 కోట్ల స్థిరాస్తులపై 30 శాతం జయలక్ష్మి సొసైటీకి ఇవ్వాలని ఈనెల 7వ తేదీన సీఎం జగన్‌ని కలుసుకుని వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. బాధితులందరికీ ఆర్థిక న్యాయం చేయడం జరుగుతుందని, కోర్టులో న్యాయపరమైన సాంకేతిక సమస్యలు పరిష్కారం అయిన వెంటనే డిపాజిట్ చేసిన సొమ్ములను బట్టి నగదు చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సొసైటీ వ్యవహారాలన్నీ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, బాధితులు ఎటువంటి అపోహలకు గురికావద్దని కోరారు. పాలకవర్గమంతా బాధితుల ప్రయోజనార్థం పనిచేస్తున్నారని, లోన్లు తీసుకున్న వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ సమయంలోనైనా ఆఫీసుకు వచ్చి కార్యకలాపాలను పరిశీలించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు చింతా సుబ్బారావు, కొమ్మనమంచి గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



జంట హత్యల కేసులో నిందితుడిని చూపుతున్న పోలీసులు

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, మార్చి 22: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరిగిన జంటహత్యల కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు శుక్రవారం వెల్లడించారు. కేసులో నిందితుడు నేరం అంగీకరించి స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు తెలిపారు. చేబ్రోలు గ్రామానికి చెందిన లోకా నాగబాబు అదే గ్రామానికి చెందిన పెండ్యాల లోవతో 22 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నట్టు నాగబాబు తన నేరాంగీకారంలో తెలిపాడు. అయితే లోవ అదే గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాస్‌తో సంబంధం ఏర్పరచుకున్నట్టు అనుమానంతో ఇద్దరూ పంటపొలాల్లో ఉండగా హత్య చేయడంతోపాటు లోవ తల్లి ఇసరపు రామలక్ష్మిపై హత్యాయత్నం చేసినట్టు పోలీసులు తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో నాగబాబును గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్టు వారు చెప్పారు. హత్యకు వినియోగించిన కత్తి, రక్తంతో తడిచిన బట్టలు, సంఘటనను వీడియో తీసిన సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు బాలురు అరెస్టు

మండపేట, మార్చి22: ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల బాలుర ముఠాను అరెస్టు చేసినట్టు మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు. ఈనెల 11న మండపేట మెయిన్‌రోడ్డులో ఉన్న మెడిప్లస్ మెడికల్ దుకాణంలో ముగ్గురు బాలురు దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా సిబ్బంది పట్టుకునే ప్రయత్నంలో తప్పించుకున్నారన్నారు. ఈనెల 21న మండపేట ఏడిద రోడ్డులో ముగ్గురు బాలురు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన నేరాలను అంగీకరించారన్నారు. బాలురు ముగ్గురు మండపేట, రామచంద్రపురం, సర్పవరం పీఎస్‌ల పరిధిలో తొమ్మిది నేరాలకు పాల్పడ్డారన్నారు. ద్రాక్షారామ, గొల్లపాలెం, తునిలో చేసిన నేరాల్లో బెయిల్ తీసుకుని బయట వచ్చారన్నారు. బాలురు రామచంద్రపురంలో చేసిన దొంగతనం కేసులో రూ.వెయ్యి నగదు, సెల్‌ఫోన్, మండపేట రూరల్ పరిధిలో చేసిన దొంగతనం కేసులో రెండు బైక్స్ వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు బాలురను కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఎస్పీ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ సీఐ అఖిల్‌జమ నేతృత్వంలో పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి రెండు బృందాలుగా ఏర్పడి బాలురను అరెస్టు చేశారు. ఈ కేసులో రెండు బృందాల్లో పాల్గొన్న పోలీసులు రమేష్, సతీష్, రమణలను ఎస్పీ అభినందించారు.

28న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 22: ఈనెల 28న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం నియమావళికి లోబడి ఈ సమావేశాలు జరుగనున్నామన్నారు. ఈ సమావేశాలకు సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని సీఈవో కోరారు.

వాడపల్లిలో ప్రొటోకాల్ నిలుపుదల

ఆత్రేయపురం, మార్చి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా వీఆర్వో కార్యాలయాన్ని మూసివేస్తున్నామన్నారు. భక్తులకు ప్రొటోకాల్, సిఫార్సు లేఖలు, ప్రత్యేక దర్శనాలు, ఆలయ మర్యాదలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిలుపుదల చేసినట్టు ఈవో తెలిపారు. సిబ్బంది ఎన్నికల నియమావళి పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోలీకి ప్రత్యేక రైలు

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈనెల 23న రైలు నెం.07645 సికింద్రాబాద్-సంత్రాగచి, ఈ నెల 25న రైలు నెం.07646 సంత్రాగచి-సికింద్రాబాద్ రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. వీటికి విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోటలలో హాల్ట్ సదుపాయం కల్పించారు.

33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22: అత్యవసర సేవల్లో పనిచేస్తూ పోలింగ్ కేంద్రాలకు రాలేని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులు.. రైల్వే, రవాణా సేవలు, పాత్రికేయులు, విద్యుత్‌శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్స్, దూరదర్శన్, రేడియో ఉద్యోగులు, మిల్క్ యూనియన్లు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్, కారాగారాలు, ఎక్సైజ్, అటవీశాఖ, పోలీస్, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, విపత్తు నిర్వహణ వంటి శాఖల ఉద్యోగులు ఉపయోగించుకోవాలన్నారు. దీనికి అవసరమైన ఫారమ్ 12డి అందుబాటులో ఉంచుతామని ఆమె తెలిపారు.



కోరుకొండలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి సదస్యం.. వైభవంగా ఆంజనేయస్వామి వాహనంపై గ్రామోత్సవం దృశ్యం

వైభవంగా నరసింహస్వామి సదస్యం

కోరుకొండ, మార్చి22: చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి స్వామి ఆలయ ముఖ మండపం వద్ద స్వామి వారికి సదస్యం నిర్వహించారు. వైకానస ఆగమశాస్త్రం ప్రకారం ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానం వేద పండితుల సమక్షంలో స్వామి వారి సదస్యం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సదస్యం అంటే స్వామి వారి, అమ్మవారిని ఆశీనులుగావించి మంగళాశాసనం చేయడం, స్వామివారి కల్యాణం జరిగిన మూడో రోజు రాత్రి సదస్యం నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. ఏకాదశి రోజు రాత్రి కల్యాణం జరిగిన లక్ష్మీసమేత నరసింహస్వామి వారికి శ్రీ భూసమేత అనంత పద్మనాభస్వామి వారికి ఒకే వేదికపై పక్కపక్క ఆశీనులు గావించి వేద పండితులు మంగళశాసనం చేశారు. అమ్మవారి తరుఫున కొందరు పండితులు, స్వామివారి తరుఫున కొందరు పండితులు రెండు బృందాలుగా ఏర్పడి అమ్మవారి గుణగణాలను, స్వామి వారి గుణగణాలను కీర్తించారు. అనంతరం స్వామివారికి నాలుగు వేదాలు చదివి వినిపించారు. ఇందుకోసం అన్నవరం దేవస్థానం నుంచి ప్రత్యేకంగా వేదపండితులు వచ్చారు.

ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామివారు ఆంజనేయ వాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి వాహనం తమ తమ ఇళ్ల ముందుకువచ్చినపుడు స్వామి వారికి పండ్లు సమర్పించి మంగళనీరాజనాలు అందించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరాసర రంగరాజభట్టర్, పరాసర లక్ష్మీనరసింహభట్టర్, అర్చక స్వాములు, వేద పండితులు, ఆగమ బ్రహ్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రంగనాథుని కల్యాణం

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్యకల్యాణమహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు శనివారం రాత్రి 9 గంటలకు స్వామివారికి రంగనాథస్వామి ఆలయ సన్నిధిలో స్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా రంగనాథస్వామి వారి కల్యాణం కూడా నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం.



పొగాకు బ్యారన్ ద్వారం నుంచి అగ్ని కీలల దృశ్యం

దొండపూడిలో రెండు పొగాకు బ్యారన్‌లు దగ్ధం

రూ.7 లక్షల ఆస్తి నష్టం

గోపాలపురం, మార్చి22: మండలంలోని దొండపూడిలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రెండు పొగాకు బ్యారన్‌లు కాలిబూడిదయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో మద్దాల స్వాతి, పెనుభూతుల నాగజ్యోతిమౌనికలకు చెందిన పొగాకు బ్యారన్‌లలో శుక్రవారం తెల్లవారుజాము అగ్నికీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు గమనించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించాల్సి వచ్చింది. బయట నుంచి మంటలను ఆర్పేందుకు వీలు లేకపోవడంతో ముఖద్వారం కిటికీల నుంచే అదుపు చేశారు. ఈ ఘటనలో మద్దాల స్వాతికి చెందిన బ్యారన్‌లో పొగాకు దగ్ధమై రూ.5 లక్షలు, నాగజ్యోతి మౌనిక బ్యారన్‌కు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేసినట్టు తెలిపారు.

విపత్తు నిర్వహణశాఖ మేనేజర్‌గా లావణ్య

కలెక్టరేట్(కాకినాడ), మార్చి22 : కాకినాడ జిల్లా విపత్తు నిర్వహణశాఖ ప్రాజెక్ట్ మేనేజర్‌గా మందుల లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్డీవోగా పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఆమె ఇక్కడికి వచ్చారు.



అల్లవరంలో కారును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బృందం

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

కారులో ఆధారాలు చూపని రూ.9.75 లక్షలు స్వాధీనం

అల్లవరం, మార్చి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ.9.75 లక్షల నగదు కనిపించింది. హైదరాబాద్ నుంచి వచ్చి భూమి రిజిస్ట్రేషన్ కోసం అమలాపురంలో ఈ నగదు డ్రా చేసుకుని కొమరగిరిపట్నం వెళ్తున్నట్టు కారు యజమాని అధికారులకు తెలిపాడు. సరైన ఆధారం చూపించలేకపోవడంతో ఈ వ్యవహారాన్ని కలెక్టరు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, స్వాధీనం చేసుకున్న నగదును డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు. బ్యాంకు మేనేజరు పరిశీలించారని, ఆధారాలు చూపితే నగదు తిరిగి ఇస్తామన్నారు. ఈ తనిఖీల్లో తహశీల్దారు సునీల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శేఖర్‌బాబు, కానిస్టేబుల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

గౌరీపట్నంలో మేరీమాత ఉత్సవాలు

దేవరపల్లి, మార్చి22: గౌరీపట్నం కొండపై 44 ఏళ్ల కిందట మరియమ్మతల్లి వెలిసిందని, అప్పటినుంచి ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక నిలయంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందిందని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నం మేరీమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రాన్ని ప్రాంతాలకు, మతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకుంటారన్నారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో వస్తారన్నారు. శని, ఆదివారాల్లో 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో క్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్ బాల, ఫాదర్ మోజేష్, ఫాదర్ జార్జ్ ఫిలిప్, ధర్మరాజు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో మేరీ మాత ఆలయం



నిందితుడిని అరెస్టు చేసి చూపుతున్న జీఆర్పీ పోలీసులు

రైళ్లలో దొంగ అరెస్ట్.. సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం, మార్చి22(ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు(జీఆర్పీ) అరెస్టు చేశారు. సీఐ విజయశంకర్ వివరాల ప్రకారం.. డీఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆదేశాలతో రైళ్లలో చోరీలు చేస్తున్న వాళ్లపై నిఘా పెట్టామన్నారు. ఈ క్రమంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేటకు చెందిన అన్నెం వీర శ్రీనివాస్‌ని అరెస్టుచేసి రూ.2.70 లక్షల విలువైన 28.70 గ్రాముల బంగారం, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ లోవరాజు, కానిస్టేబుళ్లు వీరబాబు, రవి, రామారావు, ఆర్పీఎఫ్ సిబ్బందిని డీఎస్పీ మోహన్‌రావు, సీఐ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్టు

రాజానగరం, మార్చి 22: ట్రాలీ బ్యాగుల్లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని తూర్పుగోనగూడెం వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి వ్యవహారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి సీఐ పి.కాశీవిశ్వనాథ్ శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజుజిల్లా చింతపల్లి మండలం కట్టుబంద గ్రామానికి చెందిన తాంబెల్లి లక్ష్మి, కొమ్మంగి పంచాయతీ పరిధిలోని చిన్న కొత్తవీధి గ్రామానికి చెందిన దిప్పల రాధా అనే మహిళలు గంజాయిని ట్రాలీ బ్యాగుల్లో నింపి చింతపల్లి నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు తూర్పుగోనగూడెంవద్ద తనిఖీలు నిర్వహించగా బ్యాగుల్లో రూ.2.10 లక్షల విలువైన 22 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. చెన్నై తరలిస్తున్నట్టుగా నిందితులు చెప్పారన్నారు. ఎస్ఐ మనోహర్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయితోపాటు అదుపులోకి తీసుకున్న నిందితులు

మురారిలో 23 కిలోల గంజాయి స్వాధీనం

గండేపల్లి, మార్చి 22: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వెళ్లే జాతీయ రహదారిలో మురారి గ్రామంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద జగ్గంపేటకు చెందిన కాపవరపు బాలాజీ, అతని స్నేహితుడు నైనపు వెంకట సురేషలు మోటార్‌సైకిల్‌పై విశాఖ ఏజెన్సీ ప్రాంతం ధారకొండ నుంచి సుమారు 23 కిలోల గంజాయిని మోటార్ సైకిల్‌పై తరలిస్తున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు సీఐ లక్ష్మణరావు ఆదేశాలతో గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా లక్ష తులసి అర్చన పూజలు

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 22: అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా వైభవంగా లక్ష తులసి అర్చన పూజలు నిర్వహించారు. కాకినాడ మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నిత్య హోమం జరిగింది. మల్లిపూడి అమర్ కుమార్ నేతృత్వంలో తులసి అర్చన పూజలు జరిగాయి. అలాగే పీవీ రమణ, కె.సుశీల పాడిన ఘంటసాల సినీ భక్తి విభావరి ఆకట్టుకుంది.

సైకో జగన్‌కు బుద్ధి చెప్పాలి : మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు, మార్చి 22: రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా సైకో జగన్‌కు బుద్ధి చెప్పి టీడీపీ, జనసేన, బీజేపీకి అండగా నిలవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని, చేబ్రోలు గ్రామంలోనే 146 సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందించామని ఆయన చెప్పారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ఎంపీ గీత పూర్తిగా విఫలమయ్యారని, ఐదేళ్లలో గ్రామానికి చేసింది శూన్యమని వర్మ విమర్శించారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, రవి, ఓరుగంటి వీరబాబు, దూళ్ల లచ్చబాబు, మణిబాబు, పల్లయ్య, వినయ్‌నాయుడు, నాగేంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు : కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 22: రానున్న వేసవిలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. మంచినీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పురపరిపాలనశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో శుక్రవారం సమీక్షించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, సీడీఎంఏతోపాటు పలువురు ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం నీటిఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్ ఇక్కడి అధికారులతో సమీక్షించారు. రూ.1.28కోట్లతో నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణను రూపొందించామన్నారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా, అద్దె ప్రాతిపదికన జనరేటర్ల ఏర్పాటు, మోటార్లు మరమ్మతులు సహా 20 పనులకు సంబంధించి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈలు ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

ఏలేశ్వరం, మార్చి 22: రేషన్ డీలర్లు, ఆపరేటర్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ రంగారావు తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోఉన్నందున పాటించవలసిన నియమాలు, సూచనలు తెలిపారు. రేషన్ పంపిణీ వాహనాలపై రాజకీయ నాయకులు, నవరత్నాల చిత్రాలను పచ్చ కవర్‌తో పూర్తిగా మూసివేయాలని, షాపుల వద్ద రాజకీయ ప్రముఖుల ఫొటోలు తొలగించాలని సూచించారు. కోడ్ ఉలంఘిస్తే వారిపై 48గంటల్లో క్రమ శిక్షణ చర్యలు, విధుల నుండి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.రవి, శ్రీనివాస్, అవసరాల కిశోర్, రొంగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'పరిష్కారం కానున్న వేతనాల సమస్య'

ప్రత్తిపాడు, మార్చి 22: మండలంలోని ఉపాధి హామీ కూలీల వేతనాల సమస్య ఏప్రిల్ మొదటి వారంలో పరిష్కారం కానుందని మండల ఉపాధి హామీ పథకం ఏపీవో పీవీ కుమార స్వామి తెలిపారు. ఉపాధి పథకం పనుల వ్యవహారంపై వంతాడ గిరిజనులు ధర్నా, ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో శుక్రవారం ఏపీవో వంతాడ గ్రామాన్ని సందర్శించి ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. 38 మంది ఉపాధి పనుల్లో పాల్గొన్నామని, గత 8 వారాలుగా సొమ్ములు చెల్లించడం లేదని వాపోయారు. ఏపీవో ఉన్నతాధికారులతో సంప్రదించి ఏప్రిల్ మెదటివారంలో జమ చేసేందకు హామీ ఇచ్చారు. సోమవారం నుంచి పనులు చేపడతామని కూలీలు తెలిపారు.

'నాగేశ్వరరావు మృతి తీరని లోటు'

కాకినాడ సిటీ, మార్చి 22: టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటపల్లి నాగేశ్వరరావు మృతి తీరని లోటని కాకినాడ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సంతాపం తెలిపింది. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వయంవరపు శ్రీనివాసరావు, కాకినాడ టౌన్ అధ్యక్షుడు భీమనపల్లి వీరబాబు, ఉపాధ్యక్షులు గన్నేరు గోపి, సిగటాపుల రామారావు, బందరు అప్పారావు, పట్నాలు చంద్రరావు, తగరంపూడి వాసు ఉన్నారు.

'ఒక్క సంక్షేమ పథకం అందలేదు'

రౌతులపూడి, మార్చి 22: మా కుటుంబం అన్ని ఎన్నికల్లోనూ వైసీపీకి ఓటు వేసి 50 సెంట్లు భూమిని అమ్ముకున్నామని, వైసీపీకి ఓటు వేసినందుకు ఒక్క సంక్షేమ పథకం అందలేదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావును ఓ మహిళ ప్రశ్నించింది. బంగారయ్యపేటలో శుక్రవారం జరిగిన గడపగడపకు వైసీపీ కార్యక్రమంలో ఓ మహిళ మాట్లాడుతూ గృహం నిర్మాణం లోన్ అందక 50 సెంట్లు భూమి అమ్ముకుని ఇల్లు నిర్మించుకున్నామని వాపోయింది. మరో మహిళ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని తెలిపింది. వైసీపీలో వర్గవిబేధాలు కన్పించాయి. కుర్రా దొరబాబు వర్గం, సర్పంచ్ దొంగబాబు వర్గం వేర్వేరుగా వరుపులకు స్వాగతం పలికారు.

అభివృద్ధిపై పోస్టర్ల ఆవిష్కరణ

జగ్గంపేట, మార్చి 22: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ స్వగృహం నందు గోకవరం మండలం రంపయర్రంపాలెంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై పోస్టర్లు రూపొందించగా నెహ్రూ శుక్రవారం ఆవిష్కరించారు. జగ్గంపేట నియోజకవర్గ ఐటీడీపీ ఛాంపియన్ ఉంగరాల గణేష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పని చేసే నాయకుడు నెహ్రూ అన్నారు. రంపయర్రంపాలెంలో గ్రామంలో నెహ్రూ రూ.7కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఇంకా రూ.1.78కోట్లు ఆగిపోయాయని మళ్లీ అభివృద్ధి చేసే సత్తా ఉన్న నాయకుడు నెహ్రూను గెలిపించుకోవాలని కోరుతూ ప్రత్యేక పోస్టర్లు రూపొందించి రంపయర్రంపాలెం, వెంటపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ ఈది అశోక్, నవనాసి గణపతి, గుడిసే లక్ష్మీనారాయణ, చేర్ల నాని, నవనాసి వెంకన్న తదితరులున్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

కిర్లంపూడి, మార్చి 22: ఎన్నికల సమీపిస్తున్న దృష్ట్యా మండలంలో రాజుపాలెం, వీరవరం, వేలంక, కిర్లంపూడి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ జబీర్ ఆధ్వర్యంలో కవాతు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఏ అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన ఇద్దరికి జైలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), మార్చి 22: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వాహనదారులకు రెండేసి రోజుల జైలుశిక్ష, మరో ఇద్దరికి తలో రూ. 10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా, నలుగురు వాహనదారులు మద్యం తాగి బైక్‌లు నడిపినట్టు నిర్ధారించారు. వారిని కోర్టులో హాజరు పర్చగా ఇద్దరు వాహనదారులకు రెండేసి రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి చెరో రూ.10 వేలు జరిమానా కోర్టు విధించిందని చైతన్యకృష్ణ చెప్పారు.

వార వినోద్‌కు గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డు

సర్పవరం జంక్షన్, మార్చి 22: నిరుద్యోగ యువత, నిరుపేదలకు ఐటీ సాఫ్ట్‌వేర్ పోటీ పరీక్షల విభాగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డును కేంద్ర మంత్రి చేతులమీదుగా అందుకున్నట్టు రమణయ్యపేట ఏపీఎస్పీకి చెందిన వీజేఎస్ఎంఆర్ ఒడిగోస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వారా వినోద్ తెలిపారు. ఈనెల 20న ఢిల్లీలో రాడిసన్ బ్లులో నిర్వహించిన గ్లోబల్ ఎచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి శ్రీపాద ఏసో నాయక్, బాలీవుడ్ హీరోయిన్ ఊర్మిళమాతోండ్కర్‌ల చేతుల మీదుగా బెస్ట్ సాఫ్ట్‌వేర్ అండ్ ట్రైనింగ్ రిక్రూట్‌మెంట్ కంపెనీ ఇన్ సౌత్ ఇండియా కేటగిరీలో అందుకోవడం జరిగిందని తెలిపారు.

దాళ్వా వరి కోతలు ప్రారంభం

సామర్లకోట, మార్చి 22: సామర్లకోట ఏడీబీ రోడ్డు వెంబడి సాగుచేసిన దాళ్వా వరిపంత పక్వదశకు చేరడంతో శుక్రవారం కోతలు ప్రారంభించారు. రైతు బేతిన బాబ్జీకి చెందిన నాలుగెకరాల పొలంలో అజిత్ సీటీ అనే సన్నరకం విత్తనాన్ని సాగు చేయగా 42 బస్తాల మేర ధాన్యం దిగుబడి అయ్యాయి. 2 రోజుల క్రితం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఎకరాకు సుమారు 5బస్తాల మేర ధాన్యం దిగుబడులు నేలరాలి నష్టం వాటిల్లిందని రైతు బాబ్జీ చెప్పారు. మండలంలో దాళ్వా వరికోతల విషయమై ఏవో ఐ.సత్య మాట్లాడుతూ ప్రస్తుత దాళ్వా వరిసాగు కాలంలో పంటలపై వాతావరణం సానుకూలత కారణంగా చీడపీడల బెడద తక్కువగానే ఉందని చెప్పారు.

అపస్మారకస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి

కిర్లంపూడి, మార్చి 22: మండలంలోని సోమవరం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండడాన్ని గమనించి పోలీసులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. వీఆర్వో రాముడు ఫిర్యాదు మేరకు పోలీసులు ముందు ప్రత్తిపాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ వ్యక్తికి వయస్సు 50ఏళ్లు, గెడ్డం కలిగి ఉండి, ఎరుపు, తెలుపు చారల ఫుల్‌హ్యాండ్ చొక్కా, మాసిన లుంగీ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు జగ్గంపేట సీఐ 9440796529, కిర్లంపూడి ఎస్ఐ 9440904834కు సంప్రదించాలని పోలీసులు కోరారు.

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే అధికారం

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



సామర్లకోటలో ప్రచారం నిర్వహిస్తున్న రాజప్ప



జగ్గంపేట: టీడీపీలో చేరినవారితో నెహ్రూ

సామర్లకోట, మార్చి 22: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, టీడీపీ పట్టణ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సామర్లకోటలోని బ్రౌన్‌పేట, కుమ్మరివీధి, కందదొడ్డి తదితర దళితవాడలలో జనసేన పెద్దాపురం ఇన్‌చార్జి తుమ్మల బాబుతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాజప్ప ప్రజలకు టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరిస్తూ టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్ల వరకూ ఇంట్లో ఎంతమంది మహిళలున్నా ఒక్కొక్కరికీ నెలకు రూ. 1,500లు చెల్లిస్తారన్నారు. తల్లికివందనం పేరిట ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా ఏడాదికి ఒక్కొక్కరికీ రూ.15వేలు చెల్లిస్తారన్నారు. ఒక్కో మహిళకూ ఏడాదికి 3 గ్యాస్‌సిలిండర్లు అందజేస్తారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుందన్నారు. సామర్లకోట 16వ వార్డులో వైసీపీకి చెందిన దివిలి దుర్గాచారి, దివిలి శ్రీరామ్, రొట్టా ప్రసాద్, దివిలి సత్యనారాయణ, మావుళ్ళ శివ, ఎండీ. ఫరూఖ్ తదితర 25 మంది అనుచరులు శుక్రవారం రాత్రి రాజప్ప సమక్షంలో టీడీపీలో చేరగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందించారు. అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాపురం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పనిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. స్థానిక సుధా కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చినరాజప్ప సమక్షంలో సామర్లకోటకి చెందిన పలువురు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజా సూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో...

కాజులూరు, మార్చి 22: మండలంలో గొల్లపాలెం గ్రామంలో వైసీపీ మండలాధ్యక్షుడు గుబ్బల ఏసు రాజు ఆధ్వర్యంలో సుమారు 300 మంది వైసీపీ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో శలపాక సర్పంచ్ పోతుల గనిరాజు, దుగ్గుదూరు సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, జ్యోతిబాబు, మంజేరు సొసైటీ చైర్మన్ గండి కిషోర్, గొల్లపాలెం చీకట్లవారి పేట, సాయిబాబ కోలనీ, ఫిషర్‌మెన్ కోలనీ, ధనలక్ష్మి పేట, అరుందతీ పేట ప్రాంతాలకు చెందిన పలువురు ఉన్నారు. తోట కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయల బాబ్జీ, క్లస్టర్ కోఆర్డినేటర్ వనుం వీరబ్రహ్మం, మాజీ ఎంపీపీ బొడ్డు విష్ణుమూర్తి, చుండ్రు వీర్రాజుచౌదరి,సలాది సాయిబాబా ఉన్నారు.

ఇర్రిపాకలో....

జగ్గంపేట, మార్చి 22: ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ స్వగృహం వద్ద జగ్గంపేట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గల్లా బాబ్జి ఆధ్వర్యంలో చింతల శ్రీను, మచ్చ మురళి, అప్పికొండ వీరబాబు, పక్కుర్తి తాతారావు, పిల్లా సురేష్, గుణబత్తుల చిట్టిబాబు, మణికంఠ, తదితర 20 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో గల్లా శ్రీను, గుడివాడ రాజారావు, గంధం వెంకటరమణ, అప్పికొండ వెంకటరమణ, సుంకర గోపి, గల్లా ఈశ్వరరావు, గుడివాడ సత్తిబాబు, అడపా శ్రీను, పిల్ల అప్పారావు, రాయిసింగరరావు తదితరులున్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, మార్చి 22: వైసీపీకి చెందిన జిల్లా కార్మిక నేత పత్రి రమణ రమణతో పాటు మరో 200 మంది వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పత్రి రమణతో పాటు మండల కార్మిక సంఘ నాయకులు పత్రి గౌరీశంకర్, పినికోటి రవి, పత్రి వీరబాబు, అంబటి నాని, పత్రి అచ్చారావు, రాజు, రాంబాబు, ఆకారపు సూరిబాబుకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు మీసాలరాజు, మురళిరాజు, కన్నబాబు, జగదీష్, అమరాది వెంకట్రావు, బదిరెడ్డి గోపి, మంతెన శ్రీను, ఇళ్ళ అప్పారావు తదితరులు ఉన్నారు.



కాజులూరు: గొల్లపాలెంలో వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానించిన సుభాష్

వైసీపీ పాలనలో అభివృద్ధి దూరం



రావికంపాడులో ప్రజలతో మాట్లాడుతున్న దివ్య

తొండంగి, మార్చి 22: వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని తుని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి యనమల దివ్య అన్నారు. శుక్రవారం రావికంపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తే వైసీపీ పాలనలో సంక్షోభ పాలన అందుతోందన్నారు. పేదల కోసం టీడీపీ మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు తదితర సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించిందన్నారు. మెరుగైన పాలన కోసం తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల నాగేశ్వరావు, యనమల కృష్ణ, యనమల రాజేష్, చొక్కా అప్పారావు, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, చిరంజీవిరాజు, రాంబాబు రాజు, అరిగెల నర్సింహమూర్తి, సిద్ధాం రాంబాబు, వెల్నాటి భరత్, పోసిన నందిబాబు, చోడిశెట్టి గణేష్, కోడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



అనంతలక్ష్మి, నానాజీలకు హారతులిస్తున్న మహిళలు

కరప, మార్చి 22: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలతో ఎన్నడూలేని రీతిలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుందని టీడీపీ రూరల్ కోఆర్డినేటర్ పిల్లిసత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, కాకినాడ రూరల్ జనసేన ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ తెలిపారు. శుక్రవారం మండలంలోని గొడ్డటిపాలెంలో ఉమ్మడి పార్టీల నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి జనసేన-టీడీపీ అభ్యర్థి పంతం నానాజీకి గ్లాసుగుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, దేవు వెంకన్న, బండారు మురళీ, గుల్లిపల్లి శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందు, చంద్ర వెంకన్నరాయచౌదరి, కోటగిరి మహేంద్రబాబు పాల్గొన్నారు.

'భాస్కర్‌ను సస్పెండ్ చేసిన టీడీపీ'

కోటనందూరు, మార్చి 22: మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిని లెక్కల భాస్కర్‌ను పార్టీ ముందే సస్పెండ్ చేసిందని జగన్నాధపురం మాజీ సర్పంచ్‌లు యర్ర సత్యనారాయణ, జోగురత్నం అన్నారు. శుక్రవారం జగన్నాధపురంలో కార్యకర్తలతో కలిసి విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడతూ భాస్కర్ పార్టీ కార్యకలాపాల్లో తప్పుగా వ్యవహరించడంతో ఆయనను పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. తుని నియోజకవర్గ కోఆర్డినేటర్ గుడివాడ అప్పలనాయుడు మాష్టారు, గొర్లి రాంబాబు, మాతిరెడ్డి సత్యనారాయణ, చింతకాయల గణేష్, గొర్లి రాజు, కుసిరెడ్డి కొండబాబు, బీమిరెడ్డి లోవరాజు ఉన్నారు.

కష్టపడేవారికి గుర్తింపు లేదు

టీడీపీలో కష్టపడేవారికి గుర్తింపు లేదని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి లెక్కలభాస్కర్ అన్నారు. జగన్నాధపురంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా పార్టీ కార్యాలయాలకు రాజీనామా లేఖ పంపించామన్నారు.

టీడీపీ బహుమతుల అందజేత

జగ్గంపేట, మార్చి 22: మన టీడీపీ యాప్ ద్వారా సోషల్ మీడియాలో విశేష ప్రతిభ కనబరి గండేపల్లికి చెందిన బొల్లంరెడ్డి రామకృష్ణ చౌదరి ఎక్కువ పాయింట్స్‌తో సైకిల్ బహుమతి అందుకున్నారు. నందిగాం రాముడు, ఈది అశోక్, పెదపాటి శుభాకర్‌రావు, బొండా శ్రీనుబాబు, బొదిరెడ్డి సత్యనారాయణ, బద్ది సురేష్, తెలగరెడ్డి వీరభద్రరావు, నిమ్మగడ్డ కిషోర్, గండిపూడి శ్రీధర్, అక్కిన శ్రీనివాసరావు, ఈది రత్నజ్యోతి, కర్రి దుర్గాప్రసాద్‌లకు కేంద్ర కార్యాలయం నుంచి జెండా బహుమతులను ఇర్రిపాకలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తన స్వగృహం నందు అందజేశారు.

సత్యప్రభ విజయం సాధించడమే లక్ష్యం

బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌కుమార్

ప్రత్తిపాడు, మార్చి 22: జరగబోవు ఎన్నికల్లో నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వరుపుల సత్యప్రభ భారీ మెజార్టీతో విజయం సాధించడమే లక్ష్యమని బీజేపీ, జనసేన, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో పలువురు నాయకులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడుచిలుకూరి రామ్‌కుమార్ మాట్లాడుతూ సత్యప్రభ భారీ మెజార్టీతో గెలిచే విధంగా 3 పార్టీల శ్రేణులు, నాయకులు కృషి చేయాలన్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో సత్యప్రభ విజయం సాధించడం ఖాయమని, జిల్లాలో భారీ మెజార్టీ వచ్చే విధంగా 3 పార్టీల కార్యకర్తలు పని చేయాలన్నారు. సత్యప్రభ మాట్లాడుతూ అందరూ ఐక్యమత్యంగా పని చేయాలని, ఎలాంటి వివాదాలకు అవకాశం ఇవ్వద్దని, కలిసిమెలిసి పని చేస్తే విజయం కష్టమేమీ కాదన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సూర్యనారాయణరాజు, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, దంటుమళ్ళ రాజ్యలక్ష్మి, బీజేపీ నాయకుడు ఉమ్మడి వెంకట్రావు, కందా వీరాస్వామి, గున్నాబత్తుల రాజబాబు, టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, బస్వా ప్రసాద్, బద్ది రామారావు, ఉల్లి వీరభద్రరావు, ఓలేటి లక్ష్మీనారాయణ, బద్ది రమణ, పైలా సాంబశివరావు, తమరాన సత్యనారాయణ, అమరాది వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఉత్తమ ర్యాంకులు : వీసీ



వీసీతో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

జేఎన్టీయూకే, మార్చి 22: కృషి, పట్టుదలతో విద్యనభ్యసించిన వారు ఉత్తమ ర్యాంకులు సాధించడంతోపాటు అనుకున్న లక్ష్యాలను సులువుగా సాధించగలరని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని ఈసీఈ సెమినార్ హాల్లో గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)-2024 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయిలో ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీ, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ సుమలత, యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ రత్నకుమారి, మీరాసాహెబ్‌లు పాల్గొనగా విభాగాధిపతి లీలాకుమారి అధ్యక్షత వహించారు. వై.లక్ష్మీసాయికృష్ణ (10వ ర్యాంకు), పి.జగదీశ్వరరావు(152వర్యాంకు), గౌతమ్‌గుప్త(189), సత్యసా యి(289), టి.ప్రశాంత్ (359), ఇ.శ్రీరామ్(432), బి.సందీప్‌సింగ్ (479) ర్యాంకర్లను వీసీ అభినందించి మెమెంటోలను అందజేశారు. ఈసీఈ విభాగంలో ర్యాంకులు సాధించిన మొత్తం 65మందిలో 2వేలలోపు ర్యాంకులు సాధించిన వారిలో 22మంది ఉండగా వారిని కూడా వీసీ అభినందించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుమలతకు సన్మానం

వర్సిటీలోని యూసీఈకే ఈసీఈ సెమినార్ హాల్లో రీసెర్చ్ ఎక్సలెన్స్ విభాగంలో టాప్-100 గ్లోబల్ పవర్‌ఫుల్ ఉమెన్ అవార్డు సాధించిన రిజిస్ట్రార్ ఎల్.సుమలతకు సన్మానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ అమెరికా కేంద్రంగా దేశంలోని మెక్‌స్టెమ్ ఎడ్యువర్సిటీ వారి రీసెర్చ్ ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో టాప్-100 గ్లోబల్ పవర్‌ఫుల్ ఉమెన్ అవార్డుకు సుమలత ఎంపిక కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్‌ను వీసీ సత్కరించగా డైరెక్టర్లు, ప్రత్యేకాధికారులు, సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నారు.

కొండబాబుకు అభినందనలు

కాకినాడ సిటీ, మార్చి 22: కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును ప్రకటించడంతో ఆయన ఇంటి వద్ద శుక్రవారం పార్టీ శ్రేణులు స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. దీంతో కాకినాడ జగన్నాథపురం చర్చిస్క్వేర్ సెంటర్ ప్రాంతం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసింది. ఆయన ఇంటివద్ద టీడీపీ కార్యకర్తలు భారీగా బాణసంచా కాల్చి తీన్‌మార్ డప్పుల మోతతో సంబరాలు చేశారు. కొండబాబుకు పుష్పగుచ్ఛాలతో ముంచెత్తి శాలువాలతో సత్కరించి అభినందించారు. కొండబాబు మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాకినాడ సిటీ నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, దగ్గుపాటి పురందేశ్వరిలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే ఉమ్మడి పార్టీల విజయానికి దోహదపడతాయన్నారు. పలువురు ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, నేతలు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు అధికసంఖ్యలో కొండబాబుకు అభినందనలు తెలిపారు.



కొండబాబుకు పూలదండలు వేసిన నాయకులు

ఎన్నికల కోడ్ గుర్తుందా?



రామాలయం గోడపై వైసీపీ జెండా

రౌతులపూడి, మార్చి 22: బంగారయ్యపేట గ్రామంలో రామాలయం గోడపై వైసీపీ జెండాల ఎగరవేశారు. ఇది చూసిన చాలామంది ఆలయం గోడపై వైసీపీ పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎన్నికల కోడ్ అమలు అవుతుందా, కోడ్ గుర్తుందా అని ప్రశ్నిస్తున్నారు.

గండేపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మల్లేపల్లిలో చెత్తబండికి వైసీపీ రంగులు తొలగించలేదు. చాలాచోట్ల ప్రతీ దానిపై వైసీపీ రంగులు వేయడం వాటిని తొలగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.



మల్లేపల్లిలో చెత్తబండికి వైసీపీ రంగులు

'పాఠశాలలను తనిఖీ చేయాలి'



డీఈవోకు బొకే అందజేస్తున్న ఎంఈవో, సిబ్బంది

ప్రత్తిపాడు, మార్చి 22: జిల్లాలోని విద్యాశాఖాధికారులు మండలాల్లోని సీఆర్పీలు పాఠశాలలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని డీఈవో పి.రమేష్ ఆదేశించారు. ప్రత్తిపాడు ఎంఈవో కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. డీఈవోకు ఎంఈవోలు వి.రాజబాబు, వై.అచ్చిరాజులు బొకే అందజేసి స్వాగతం పలికారు. ఎంఈవో కార్యాలయ రికార్డులను పరిశీలించారు. వర్క్‌బుక్ లోపాలు తరుచూ పరిశీలించి సరిదిద్దాలన్నారు. టీచ్ టూల్, టోఫెల్, టిరల్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రంథాలయ పుస్తకాల పెండింగ్ వివరాలపై ఆరా తీశారు. జిల్లా విద్యాశాఖ కేంద్రం నుంచి వచ్చే ప్రతి మెయిల్‌ను పరిశీలించి త్వరితగతిన ప్రతి స్పందించాలని ఎమ్మార్సీ సిబ్బందికి సూచించారు కార్యక్రమంలో సీఆర్పీలు వి.రాంజీ ప్రసాద్, గంగాధర్, బాషా పాల్గొన్నారు.

'ప్రసవాలపై అవగాహన కల్పించాలి'

గొల్లప్రోలు రూరల్, మార్చి 22: ఆసుపత్రి ప్రసవాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్ డీపీఎంవో సురేఖ, మెడికల్ ఆఫీసర్ గోపాలకృష్ణమూర్తి సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వారు శుక్రవారం తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు అమలు, ఐరన్ పోలిక్ యాసిడ్, కాల్షియం పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు జి.శ్రీనివాసరావు, అహ్మద్‌బాషా, షేక్ రాజం బీ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



పిఠాపురం, మార్చి 22: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గరుడవాహన సేవ జరిగింది. గరుడవాహనంపై స్వామి,అమ్మవార్లను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, అభిషేకాలు, ఊంజల్‌సేవ జరిగాయి. టీటీడీ డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఆలయ అధికారి సందీప్, భక్తులు పాల్గొన్నారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం

పెద్దాపురం, మార్చి 22: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా ప్రసాదాలను వితరణ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు,వేదపండితులు తదితరులున్నారు.

సత్యదేవుడికి అభిషేకం

ఏలేశ్వరం, మార్చి 22: పట్టణంలో అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఫాల్గుణ మాసం మఖనక్షత్రం సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చకులు సత్యనారాయణ స్వామి అమ్మవార్లకు క్షీరాభిషేకం చేసి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. రూపులమ్మ తల్లి గుడిలో విశ్వహిందూ పరిషత్ మహిళలు సామూహిక, పారాయణ పూజలు చేశారు.

రాజగోపాలస్వామి కల్యాణోత్సవాలు

ప్రత్తిపాడు, మార్చి 22: మండలంలోని ధర్మవరం రాజగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రుక్మిణి సత్యప్రభ సమేత రాజగోపాలస్వామికి ప్రత్యేక హోమం నిర్వహించారు. వేములూరి ఈశ్వర మణికంఠ, సిరి దంపతులు పాల్గొన్నారు. గ్రామపెద్దలు, మహిళలు స్వామి అమ్మవార్లకు పూజలు చేశారు. ప్రధాన అర్చకులు అంగర లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ప్రవచనలు చేశారు.

ఉత్సవ విగ్రహాలు బహూకరణ

పిఠాపురం, మార్చి 22: పిఠాపురం పట్టణంలోని కత్తుల గూడెంలో ఉన్న పట్టాభి రామాలయానికి ఆంధ్రప్రదేశ్ శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం నూతన ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. రాజమహేంద్రవరానికి చెం దిన ధనుంజయరాజు, నాగరాజు, శేష ఆనంద్ దంపతులు సహకారంతో వీటిని అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయజనార్ధనాచార్యులు తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

గండేపల్లి, మార్చి 22: పోక్సో కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఇటీవల ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఐదేళ్లను బాలికను లైంగికంగా ఆ వ్యక్తి వేధించినట్టు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం పెద్దాపురం దిశ డీఎస్పీ ఆర్.రామచంద్రరావు కేసు దర్యాప్తు చేసి శుక్రవారం అరెస్టు చేసినట్టు తెలిపారు.

పదోతరగతి పరీక్షలు

సామర్లకోట, మార్చి 22: సామర్లకోట మండలం, పట్టణం పరిధిలో తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో నాల్గోరోజు శుక్రవారం పదో తరగతి గణితం పరీక్షకు 118 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. 1,915 మందికి గాను 1,797 మంది హాజరయ్యారని చెప్పారు.

ఎఫ్ఏసీ ఎగ్జామినర్‌గా సురేష్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి22: నగరపాలక సంస్థ ఎగ్జామినర్ హరిప్రసాద్ డిప్యూటేషన్‌పై ఉడా చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో జిల్లా ఆడిట్ ఆఫీసర్ వై.సురేష్ ఎఫ్ఏసీ ఎగ్జామినర్‌గా బాధ్యతలు చేపట్టారు.